ప్రజాశక్తి

శుక్రవారం 26 జులై 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ టిడిపి హయాంలో దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేసివారి పొట్ట కొట్టారని తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో దళితులకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి,ఎస్‌టి, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఎస్‌సి,ఎస్‌టిల కోసం నూతన పారిశ్రామిక విధానం అమలు చేయలేదని విమర్శించారు. బి మరియు సి కేటగిరి కింద మెడికల్ సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదన్నారు. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం అమలుకు నోచలేదన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సిఆర్‌పిసి కింద స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం ఎస్‌సిలకు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన రూ.50,000 అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపేశారని వివ రించారు. ఎస్‌సి నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉన్న అమరావతి రాజధాని నిర్మాణం నిలిపివేసినట్లు తెలిపారు. గత టిడిపి హయాంలో దళితులకు అన్ని విధాల మేలు చేశామని తెలిపారు. 2014-2019లో ఐఎస్ బి సెక్టార్, పశుసంవర్ధక శాఖ కింద బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా 60 శాతం సబ్సిడీతో రూ.2716.70 కోట్లతో 2,02,414 మంది ఎస్‌పి ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. భూమిలేని పేదలకు భూమి కొనుగోలు పథకం ద్వారా రూ. 197 కోట్లతో 2,518 మందికి 2360.77 ఎకరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డిసి కింద రూ. 552.55 కోట్లతో 10,634 ▶ 2లో

ఖరీఫ్‌కు అనుకూలం..

- వ్యవసాయ పనులు ముమ్మరం
- పెరగనున్న సాగు విస్తీర్ణం



రైతులు సాగు చేసిన వరి నారుమడులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అనుకూలంగా ఉంది. ఈ నెలలో వర్షాలు విస్తారంగా పడ్డాయి. పట్టిసీమ నుంచి నీరు కృష్ణా కాలువ ద్వారా నీరు వస్తుంది. దీంతో బాపట్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె ప్రాంతాల రైతులు ఈ పాటికే మాగాణి సాగు చేపట్టారు. వర్షాలు ఆలస్యం అవుతాయని భావించిన కొందరు రైతులు ఎదపద్ధతిలో వరిసాగు చేపట్టారు. గత వారం వరుసగా కురిసిన వర్షాలతో ఎదపద్ధతిలో వరిసాగు చేపట్టిన రైతులు కంగారు పడ్డారు. అయితే ఆ విత్తనాలకు నష్టం జరగలేదు. జలాశయాలుకు నీరు చేరడంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు వ్యవసాయ పనులకు వేగవంతం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో జులై 24 నాటికి జిల్లాలో 18 వేల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటల సాగు చేశారు. ప్రస్తుతం ఇప్పటి వరకూ 51,602 ఎకరాల్లో పంటల సాగు చేశారు. గతేడాది ఇదే రోజుకు జిల్లాలో 13 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 45 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. కాలువలకు నీరు రావడంతో పాటు గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలు మాగాణి సాగుకు జీవం పోశాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత నెలరోజుల పాటు సక్రమంగా వర్షాలు కురవలేదు. జలాశయాల్లో నీరు లేక రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు వెనుకాడారు. పట్టిసీమ నుంచి కృష్ణా బ్యారేజికి నీటి విడుదల కావడం, అక్కడి నుంచి కృష్ణా కాలువ ద్వారా పశ్చిమ డెల్టాకు నీటిని విడుదల చేయడంతో రైతులు సాగుకు సమాయత్తం అయ్యారు. వర్షాలు కూడా తోడు కావడంతో సాగు పనులు చేపట్టారు. అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీవర్షాలు కురవడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరినార్లు పోశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మెట్ట పంటల సాగుకు అనుకూలించడంతో పత్తి, మిరప, వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ పంటలు సాగు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ రూపొందించిన ఖరీఫ్ సాగు ప్రణాళిక ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆహార ధాన్యాలు, వాణిజ్య పంటలు కలిపి జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3.50 లక్షల ఎకరాలుగా అంచనా వేశారు. గత ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో 1,53,136 హెక్టార్లలో వరి పంట సాగు జరగాల్సి ఉండగా ▶ 2లో

ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు

నిధులు కేటాయించాలి

- ఆస్తులకు రక్షణ కల్పించాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో పాల కేంద్రమైన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి, వెంటనే ప్రారంభించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు డెయిరీని వెంటనే ప్రారంభించాలని కోరుతూ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ 1975లో పాలసేకరణ కేంద్రంగా ప్రారంభమైన ఒంగోలు డెయిరీ 1994కి రెండున్నర లక్షల లీటర్ల పాలు సేకరించే స్థాయికి ఎదిగిందన్నారు. పాల రైతులు రూపాయికి రూపాయి కూడ పెట్టి ఒంగోలు డెయిరీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాలపొడి కర్మాగారానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కర్మాగార స్థలానికి పాల రైతులు రూ. 19 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. 2006 నాటికి డెయిరీ రూ. 48 కోట్ల అప్పుల్లోకి వెళ్లినట్లు తెలిపారు. దీంతో ఎన్‌డిడిబి స్వాధీనం చేసుకొని 2012 నాటికి అప్పులు తీర్చి డెయిరీని లాభాల బాటలో నిలిపినట్లు తెలిపారు. 2014 వరకు లాభాల బాటలో నడిచిన డెయిరీని సహకార రంగం నుంచి కంపెనీ యాక్ట్‌లోకి తీసుకుపోవటంతో తిరిగి సంక్షోభంలో కూరు కుపోయిందన్నారు. అనంతరం వైఎస్. జగన్ పాల డెయిరీని అమూల్‌కు అప్పగించారన్నారు. లీటర్‌కు రూ.4 అదనంగా రైతులకు ఆదాయం ఇప్పిస్తామని జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని పాల రైతుల వద్దకు తిప్పించారన్నారు. నిర్వహణ సరిగా లేని అమూల్ పూర్తిస్థాయిలో చేతులు ఎత్తివేసినట్లు తెలిపారు. పాల సేకరణ 3000 లీటర్లకు పడిపోయిందన్నారు. పాలపొడి ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర ప్రాసెసింగ్ యంత్రాలు మూలన పడి తుప్పుపట్టాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఒంగోలు డెయిరీకి తగిన నిధులు కేటాయించి, సహకార రంగంలోని డెయిరీని ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. అందు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ▶ 2లో



ముటుకుల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్

సాగర్ జలాలతో

తాగునీటి పథకాలు నింపాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-పుల్లలచెరువు

సాగర్ జలాలతో తాగునీటి పథకాలను నింపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సాగర్ జలాలతో నింపుతున్న మండల పరిధిలోని ముటుకుల సమ్మర్ స్టోరేజ్‌ను గురువారం సందర్శించారు. సిపిడబ్ల్యుఎస్ పంపు హౌస్, మైక్రో ఫిల్టర్లు, క్లోరినేషన్ సంపును పరిశీలించారు. మటుకుల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి నీటి సరాఫరా జరిగే గ్రామాల వివరాల గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సమ్మర్ స్టోరేజ్ నుంచి 23 గ్రామాలకు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మర్దన్ అలీ కలెక్టర్‌కు వివరించారు. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తమ గ్రామానికి నీరు అందిస్తున్నారని,గ్రామంలో అంతర్గత పైపులైన్లు అందుబాటులోకి రాలేదని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ దష్టికి తెచ్చారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా అంతర్గత పైపులైన్ల ఏర్పాట్లకు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, ఈ పథకం 2027 మార్చి వరకూ ఉంటుందని, పైప్ లైన్లు వేసే పనులను ▶ 2లో

సైన్స్‌సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటు చేయాలి

ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాలో సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటు చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు విజ్ఞప్తి చేశారు. సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటుకు ఐదు సంవత్సరాల క్రితం ఆమోదించారని, నేటికి ఒక్క అడుగు కూడా పడలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, సైన్స్- టెక్నాలజీ శాఖ మంత్రిగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వచ్చారన్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్ వస్తుందని ప్రకాశం జిల్లా విద్యార్థులు, ప్రజలకు నమ్మకం వచ్చిందన్నారు. ఒంగోలు నగరంలో సైన్స్ సెంటర్ - ప్లానిటోరియం ఏర్పాటుకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఒక ప్రయత్నం చేశారన్నారు. 2018లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి రూ.20 కోట్లు కేటాయించారన్నారు. 2019 ఎన్నికల తరువాత కొత్త ప్రభుత్వం వచ్చిందని, గతంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అర్జీ ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. గతంలో పవన్ కళ్యాణ్ ఒంగోలు పర్యటన సందర్భంగా ఈ అంశంపై అర్జీలు ఇచ్చామని, మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా కలసి వినతిపత్రం అందజేశామన్నారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటుకు ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు కృషి చేయాలని కోరారు.

సాయం చేయటం అభినందనీయం

ప్రజాశక్తి-పిసిపల్లి

విద్యార్థులకు సహాయం చేయటం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వేము రామయ్య అన్నారు. గురువారం పీసీపల్లి హాస్టల్ విద్యార్థులు 86 మందికి మ్యాట్లు పంపిణీ చేశారు. చెన్నైలోని ఎస్సార్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న కమ్మవారి పల్లెకు చెందిన వీరపనేని నవీన్ ఆర్థిక సహకారంతో మ్యాట్లను పంపిణీ చేసినట్లు హాస్టల్ వార్డెన్ గువ్వల సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో గుడ్ హెల్ప్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి ప్రవీణ్, టిడిపి నాయకులు జోసెఫ్ ఎబినేజర్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

నాయుడు వద్దకు రాయబారానికి సన్నద్ధమవుతున్నామన్నారు.

డెయిరీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్ డిమాండ్

ఒంగోలు డెయిరీ ఆస్తుల పరిరక్షణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. పాడి రైతులు రూపాయి రూపాయి కూడబెట్టుకొని ఒంగోలు డెయిరీని ఏర్పాటు చేసుకుంటే పాలక పక్షాలు, అధికారులు డెయిరీని నష్టాలలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తగినన్ని నిధులు కేటాయించి ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలు డెయిరీ పూర్వాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డెయిరీ సహకార సంఘం నుంచి కంపెనీ యాక్ట్‌లోకి వెళ్లిన నాటి నుంచి పరిపాలన వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి పూర్తిస్థాయిలో నాశనమైందన్నారు. ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఒంగోలు డెయిరీని సహకార రంగంలోనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్.చౌదరి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు ఎస్.లలిత కుమారి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వల్లంరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల నియామక అక్రమాలపై విచారణ

ధృవీకరణ పత్రాలు పరిశీలించిన ఆర్‌డిఎం హెచ్‌ఒ శోభారాణి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో 2002 నుంచి జరిగిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాలలో జరిగిన అక్రమాలపై గుంటూరు జోనల్ ఆర్‌డిఎం హెచ్‌ఒ డాక్టర్ శోభారాణి గురువారం విచారణ జరిపారు. ఒంగోలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం గుంటూరు జోనల్ ఆర్‌డిఎం,హెచ్‌ఒ డాక్టర్ శోభారాణి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి, కార్యాలయ సిబ్బంది హెల్త్ అసిస్టెంట్లను విచారించారు. హెల్త్ అసిస్టెంట్ల నియామక పత్రాలను పరిశీలించి వారి నుంచి డిక్లరేషన్ పత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు జోనల్ ఆర్‌డిఎం హెచ్‌ఒ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్ల నియామకాలలో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్లను విచారించి తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, పరిపాలన అధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఎం హెచ్‌ఒ శోభారాణి

పొదిలి యువకుడికి 'అమెరికా' డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-పొదిలి

రోడ్డు ప్రమాదాలు, ప్రాణాపాయ స్థితిలో వున్న వారిని తన అంబులెన్సులో వేగంగా అతి తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో వైద్యశాలకు తీసుకుని వెళ్లి.. ఎంతోమందిని కాపాడిన పొదిలికి చెందిన యువకుడు గిద్దలూరి ప్రశాంత్ సేవలను అమెరికాకు చెందిన హెలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.సి) యూనివర్శిటీ గుర్తించింది. ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో యూనివర్శిటీకి చెందిన శాఖ భవనంలో ప్రశాంత్‌కు యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్ సత్కరించి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నేటి యువకులు ప్రశాంత్‌ను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జి.ప్రశాంత్ మాట్లాడుతూ జర్నలిస్టు వత్తిలో బయట తిరిగే క్రమంలో రోడ్డుప్రమాదంలో ఉన్న వారిని చూసి తనకు వచ్చే కొద్ది పాటి ఆదాయంలో ఏదో ఒకటి చేయాలి అనే ఆలోచనతో ఇటువంటి సేవాకార్యక్రమం మొదలైందన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని తన స్నేహితులు సోషల్ మీడియాలో వైరల్ చేశారని అది గుర్తించిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ దక్కడం సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు. గౌరవ డాక్టరేట్ రావడానికి సహకరించిన యూనివర్సిటీకి, సెలక్షన్ కమిటీకి, అవార్డు అందించిన పెద్దలకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరించిన మిత్రులకు శ్రేయోభిలాషులకు డాక్టర్ ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టరేట్ తీసుకుంటున్న ప్రశాంత్

ఎమ్మెల్యే చంద్రశేఖర్ క్షమాపణలు చెప్పాలి

- లేకపోతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం
- తెలుగు యువత జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అన్నా క్యాంటీన్ల నిర్వహణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు ముత్తన శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ముత్తన శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కర్షకులకు రూ.5కే అన్నం పెట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం అన్నా క్యాంటీన్ల ప్రారంభించిందన్నారు. గత ఐదేళ్ళ కాలంలో వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను మూత వేసి సచివాలయాలు ఏర్పాటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదలు, కార్మికులు, కర్షకులు, నిరుద్యోగుల పొట్ట కొట్టారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. అన్నా క్యాంటీన్లలో రూ.5లకే అన్నం పెడుతున్నా మున్సిపాలిటీలు రూ.27, ప్రభుత్వం 17 రూపాయలు భరించి ప్రజలకు అల్పాహారం, భోజనం పెడుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టిందని, అప్పటి వరకు క్యాంటీన్లు ఆగకూడదనే ఉద్ధేశంతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సొంత నిధులు, దాతల సాయంతో క్యాంటీన్లను నిర్వహిస్తున్నారన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఇటువంటి అన్న క్యాంటీన్లలో బిచ్చగాళ్ళకు పెట్టినట్లు అన్నం పెట్టి టిడిపి రాజకీయం చేస్తుందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ అన్నా క్యాంటీన్లపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పకపోతే యర్రగొండపాలెం లేదా ఒంగోలు, లేకపోతే సింగరాయకొండలోని ఎమ్మెల్యే ఇంటిని తెలుగు యువత నాయకులు ముట్టడిస్తారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి జిల్లా సోషల్ మీడియా నాయకులు గొర్రుముచ్చు శేఖర్, తెలుగు యువత అధికార ప్రతినిధి దయానంద్, తెలుగు యువత ఒంగోలు నగర నాయకులు నల్లమోతు రమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్తన శ్రీనివాసులు

దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంది ఎస్‌సి యువతకు ఇన్నోవా కార్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ ద్వారా రూ.165.29 కోట్లతో 23,389 మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించమన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.32.23 కోట్లతో 437 మంది విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. జగన్ రెడ్డి ఆ పథ కానికి పేరు మార్చి తన పేరు పెట్టుకుని అంబేద్కర్‌ను అవమానించారన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని సుజాతనగర్, సమతానగర్, పీర్లమాన్యం, శ్రీరామ్‌కాలనీ, టీచర్స్ కాలనీ, శ్రీనగర్, ప్రగతి నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిఇఇ జి.వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి విద్యుత్ లైన్లకు సంబంధించి చెట్ల కటింగ్ కారణం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖరీఫ్‌కు అనుకూలం

(మొదటిపేజీ తరువాయి)

సకాలంలో వర్షాలు పడక, కాలువల ద్వారా నీరు రాక 1,07,877 హెక్టార్లలో మాత్రమే వరిపంట సాగు అయ్యింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు బాగా పడొచ్చని రైతులు భావిస్తున్నారు. పట్టిసీమ నుంచి మాగాణి సాగుకు కావాల్సిన నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు తెలిపారు. గతేడాది సాగుకు నోచని భూములను కూడా ప్రస్తుతం సాగుకు సిద్ధం చేస్తున్నారు. మెట్ట భూములు, ఆరుతడుల పంటల సాగుకు కూడా రైతులు సిద్ధమవుతున్నారు.

సాగర్ జలాలతో తాగునీటి పథకాలు నింపాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసేలా చూస్తామని మర్దన్ అలీ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూర్ణచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్‌రావు, డిఇఇ నవకిషోర్, జెఇ రామకష్ణ ఇతర అధికారులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి..

ముటుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. ఈ అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో వాటిని చదివించి వారిలోని విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. తరగతుల స్థాయికి తగినట్లుగా వారిలో విద్యా ప్రమాణాలు లేకపోవడంతో టీచర్లపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా సిద్ధం చేసిన పులిహోరను కలెక్టర్ రుచి చూశారు. పులిహోర రుచికరంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు వాటి రుచిని, నాణ్యతను ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం ముటుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కలవకుంట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీజో మీటర్లను పరిశీలించారు. మండల పరిధిలోని కొత్తచెరువును కలెక్టర్ తమీన్ అన్సారియా పరిశీలించారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఎల్‌డిఒ సాయికుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



డ్రమ్ములో నీటిని తాగుతున్న విద్యార్థులు

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లక్షలు ఖర్చు చేసి నాడు నేడు పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరి నిరుపయోగంగా మారింది. నాసిరకపు పరికరాలు అమర్చడంతో తరచూ మరమ్మతులకు గురవుతుంది. దీని నిర్వహణ ఉపాధ్యాయులకు భారంగా మారింది. ఫలితంగా విద్యార్థులకు తాగునీరు కరువైంది. ఈ పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతునారు. ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకొంటున్నారు. ప్రత్యమ్నాయంగా ఒక డ్రమ్ములో బోరు నీటిని నింపినా ఆ బోరు నీరు ఉప్పగా ఉండటంతో విద్యార్థులు తాగలేకపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్‌ను రిపేరు చేయించి విద్యార్థుల దాహార్తి తీర్చాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉషా గ్రేస్

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గిద్దలూరు

కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.జ్యోతి అన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో హెచ్‌సిజిఎంఎన్‌ఆర్ క్యాన్సర్ సెంటర్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఇన్చార్జి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.జ్యోతి అధ్యక్షతన అవగాహన అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్కాలజిస్ట్ డాక్టర్ ఉషా గ్రేస్ కేన్సర్‌పై మాట్లాడుతూ సాధారణంగా 60 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారికి కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనినీ కణజాలం పరీక్షల వలన, లేదా బయాప్సీ ద్వారా గుర్తించవచ్చునని తెలిపారు. ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపివొ బి.జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు మరొకసారి ఒక మెడికల్ శిబిరం ఏర్పాటు చేయాలనీ హెచ్‌సిజిఎమ్మెన్నార్ కేన్సర్ సెంటర్ వారిని కోరారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉనట్లయితే వ్యాధిని జయించిన వారవుతారని తెలిపారు. హెచ్‌సిజిఎంఎన్‌ఆర్ కేన్సర్ సెంటర్ అసోసియేట్ మార్కెటింగ్ మేనేజర్ సండ్రపాటి ప్రభాకర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయీస్ హెల్త్ కార్డులు ఉన్నవారికి ఉచిత సేవలు పొందవచ్చునని ఇంకా మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్లు 74160 01416, 99897 43656 కు ఫోన్ చేసి వివరములు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెహర్ కుమార్, రీడ్స్ సంస్థ డైరెక్టర్ కత్తి అనోజీ రావు, లార్డ్స్ సంస్థ డైరెక్టర్ చిట్లూరి ఏలీయా, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు మండలాల ఐసిడిఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

పోలీసులను ఆదేశించిన జిల్లా ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-చీమకుర్తి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్‌పి దామోదర్

విచారణలో ఉన్న పెండింగ్ కేసులను త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. గురువారం ఆయన చీమకుర్తి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్‌ఐలకు పలు సూచనలు చేశారు. స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, సమస్యలను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి స్టేషన్ ఆవరణలో ఆవరణ పచ్చదనంతో నిండి ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు విజబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సిసి కెమెరాలపై అవగాహనా కల్పించాలన్నారు. జిల్లా ఎస్పీతో పాటు తాళ్ళూరు ఎస్‌ఐ విజయకుమార్, దర్శి ఎస్‌ఐ సుమన్, చీమకుర్తి ఎస్‌ఐ వెంకట కృష్ణయ్య, ఏఎస్‌ఐ రాజమోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మమ్మల్ని కార్యదర్శి వేధిస్తోంది

- అసభ్య పదజాలంతో దూషిస్తుందని పంచాయతీ కార్యదర్శిపై సిబ్బంది ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతి



ఎంపీడీవో శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - మద్దిపాడు

మీరు నా కింద పని మనుషులు.. నేను చెప్పిన పని చేయాల్సిందే.. అంటూ పంచాయతీ కార్యదర్శి తమను ఇబ్బందులకు గురి చేస్తోందని, ప్రతినెలా బతిమాలుకుంటేనే మాకు జీతం వస్తుందని, అదేంటి అని అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తుందని సచివాలయం సిబ్బంది ఎంపీడీవో ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శిపై చర్యలు తీసుకొని మమ్ములను వేధించకుండా చూడాలని కోరుతూ ఎంపీడీవో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ తాము మద్దిపాడు సచివాలయంలో ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతినెలా జీతాల విషయంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అసభ్య పదజాలంతో మాట్లాడుతుందని వాపోయారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో శ్రీహరి విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీడీవోని కలిసిన వారిలో సచివాలయ సిబ్బంది షేక్ అహ్మద్ షరీఫ్, సుభాషిణి, సుజాత రాణి, తెళ్ళ కుమారి పద్మలత, సురేష్ బాబు, శోభారాణి ఉన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి సహకరించాలి

మంత్రి డోలాను కలిసిన ఎరిక్షన్‌బాబు



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో వసతి గృహాల అభివృద్ధికి సహకరించాలని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. గురువారం సచివాలయంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నడిచే బాలికల వసతి గృహం పనులు 70 శాతమే పనులు పూర్తయ్యాయని తెలిపారు. నిధులు లేక 30 శాతం పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. ఆ పనులను పూర్తి చేస్తే 400 మంది దాకా విద్యార్థులకు వసతి దొరుకుతుందన్నారు. అలాగే కాలేజీ బాలికల హాస్టల్ లేని కారణంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉన్న వసతి గృహాలు సైతం ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసి వసతి గృహాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

'గోడ'తో పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో గల 'అక్కమ్మ బావి'కి రక్షణగా నిర్మించిన గోడతో ప్రమాదం పొంచి వుంది. రక్షణ గోడ శిథిలమై ఓ వైపుకు ఒరిగింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉంది. ఈ గోడ నివాసాల సమీపంలో ఉన్నందున చిన్నారులు అటుగా వెళితే ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకొని శిథిలమైన గోడ స్థానంలో మరో గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారిన గోడ



వివరాలు వెల్లడిస్తున్న డియస్‌పి రామరాజు

బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయి అరెస్టు

టంగుటూరు-ప్రజాశక్తి

టంగుటూరులో బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ముద్దాయి ఇత్తడి నాగరాజును గురువారం కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు అరెస్టు చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ నేరం జరిగిన తీరుని పరిశీలించి స్వయంగా పర్యవేక్షించి కనిగిరి డియస్‌పి ఆర్.రామరాజు ఆధ్వర్యంలో శింగరాయకొండ సిఐ. డి.రంగనాద్, టంగుటూరు యస్‌ఐ యు.పున్నారావులతో లోతైన దర్యాప్తు చేయించారు. కనిగిరి డియస్‌పి. ఆర్.రామరాజు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో టంగుటూరు నార్త్ బైపాస్ పక్కన ముద్దాయిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందుతుని పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన కనిగిరి డియస్‌పి రామరాజు, శింగరాయకొండ సిఐ రంగనాద్‌ని, టంగుటూరు యస్‌ఐ పున్నారావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

రూ.14,750 నగదు స్వాధీనం

ప్రజాశక్తి-పొదిలి

మర్రిపూడి మండలం జువ్విగుంట గ్రామ పొలాల్లో బుధవారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరంపై ఎస్‌ఐ శివ బసవరాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి 11 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.14,750 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ బసవరాజు తెలిపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

మట్టి టిప్పర్లు పట్టివేత

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు మట్టి టిప్పర్లను విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని మల్లవరం సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ఆదేశాల దాడులు చేశారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై మహేష్ అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులో గురువారం సాధారణ తనిఖీలలో భాగంగా వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో అధికంగా హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణం నష్టం జరుగుతుందన్నారు. హెల్మెట్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్నీ ఉండాలన్నారు. అనంతరం హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారికి ఈ-చలానా వేసినట్లు చెప్పారు.

సిపిఎం నాయకులు 'మండవ'కు నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

అముదాల లంకలో సిపిఎం నాయకులు వెంకట సుబ్బయ్య 21వ వర్ధంతి సందర్భంగా మండవ వెంకట సుబ్బయ్య, చిట్టెమ్మ, కృష్ణమూర్తి చిత్రపటాలకు ముమ్మనేని నాగేశ్వరరావు, బిఎల్‌కె ప్రసాద్, సిహెచ్ మనీ లాల్ పూల మాల వేసి నివాళులర్పించారు. వేములపల్లి వెంకట రామయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్ మాట్లాడారు. చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా లంక గ్రామాల్లో పేదలకు లంక భూములు పంచడానికి చేసిన పోరాటంలో వెంకట సుబ్బయ్య, చిట్టెమ్మ, కృష్ణమూర్తి పాత్ర కీలకమైందని అన్నారు. నిరంతరం పేదల సమస్యలపై కృషి చేశారని అన్నారు. ఆమదాల లంక గ్రామంలో సిపిఎం అభివృద్ధికి


మండవ సుబ్బయ్యకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆయన చేసిన కృషి మరువ లేనిదని అన్నారు. అటువంటి వ్యక్తులు భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ఆశయాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి సిపిఎం కృషి చేస్తుందని అన్నారు. గ్రామాల్లో రైతు, వ్యవసాయ కూలీల సమస్యలపై సిపిఎం పనిచేస్తుందని అన్నారు. దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం కోసం సిపిఎం కృషి చేసిందని అన్నారు. కరోన సమయంలో లంక గ్రామాల్లో హెూమియో మందులు ఉచితంగా ఇవ్వడంలో సిపిఎం ఎంతో కృషి చేసిందని అన్నారు. మండవ వెంకట సుబ్బయ్య, చిట్టెమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొనిగల సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు, బిఎల్‌కె ప్రసాద్, నాగేశ్వరరావు, భట్టిప్రోలు మండల నాయకులు జి సుధాకర్, సత్యనారాయణ, నాగరాజు, దీపాల సత్యనారాయణ, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న సుభాషిణి

విద్యార్థినికి ఇన్నర్‌వీల్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - చీరాల

ఇన్నర్ వీల్ క్లబ్ అన్ని వేళల సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటుందని క్లబ్ డిస్ట్రిక్ట్ ఎడిటర్ ఇస్తర్ల సుభాషిణి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ అవరణంలో ఇంటర్ పరీక్షల్లో 980 మార్కులతో పాట్న ఐఐటిలో సీటు సాధించిన బోగిరెడ్డి సంయుక్త అనే విద్యార్థిని చదువుల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంయుక్తకు ఇంటర్మీడియట్ నుండి డాక్టర్ ఐ బాబురావు ఆర్థిక సహాయం అందజేస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్బు ప్రెసిడెంట్ భాను కుమారి, లలిత, నలిని పాల్గొన్నారు.

ఉప్పాల శివలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి - బాపట్ల


ఉప్పాల శివలక్ష్మి

మండలంలోని నందిరాజుతోట గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని ఉప్పాల శివ లక్ష్మికి తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన శివలక్ష్మి మాట్లాడుతూ వర్సిటీ ఆచార్యులు పి రేణుక మార్గదర్శకత్వంలో స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే పరిశోధన గ్రంథాన్ని విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి నేతృత్వంలో సమర్పించినట్లు తెలిపారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న తోకల కృష్ణమోహన్

వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంభోట్ల వారిపాలెం గ్రామంలో వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న మానం శివరామప్రసాద్‌కు దొడ్డా వెంకట్రావు విజ్ఞప్తి మేరకు రు.50వేలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా అనారోగ్యం నుండి కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందజేసినందుకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, సర్పంచి నెల్లూరి అనంతమ్మ పాల్గొన్నారు.

కంపోస్టు షెడ్డు వినియోగించాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డును వినియోగంలోనికి తీసుకు రావాలని ఎంపిడిఒ ఎన్‌విజికె మూర్తి పంచాయితీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డు పరిసర ప్రాంతాల్లోని చిల్ల చెట్లను జెసిబీ ద్వారా గురువారం తొలగించారు. చుట్టుపక్కల ప్రాంతం చదును చేశారు. షెడ్డును వెంటనే వినియోగంలోనికి తీసుకురావాలని చెప్పారు. గ్రామంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వ్యర్థ పదార్థాలను షెడ్డుకు చేర్పించి అక్కడ సెగ్రిగేట్ చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి బాబురావుకు పారిశుద్య నిర్వహణపై సూచనలు చేశారు.

చేనేత నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

పెద్ద ఎత్తున నిల్వ ఉన్న చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం ఆప్కో, లేపాక్షి సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని చీరాల మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంత్రి సవితను కోరారు. శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య నేతృత్వంలో చీరాల చేనేత ప్రతినిధుల బృందం అమరావతి క్యాంప్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఎకనామికల్లి వీకర్స్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మంత్రి సవితను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చేనేతల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. చీరాల ప్రాంతంలోనే కోట్ల విలువైన చేనేత వస్త్రాల నిల్వలు ఉండిపోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చేనేత వస్త్రాల నిల్వలు అలానే ఉండిపోతే, కొత్తగా వస్త్రోత్పత్తి చేయడం కష్టమని తెలిపారు. ఈ నేపథ్యంలో చేనేత వస్త్రాల నిల్వలను వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చేత వస్త్రాలపై ఉన్న జీఎస్టిని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన జీఓ ప్రకారం చేనేతలకు కేటాయించిన 11రకాల వస్త్రాల రిజర్వేషన్లను అమలు చేయా


మంత్రి సవితతో మాట్లాడుతున్న చేనేత ప్రతినిధులు

లని, చేనేత కార్మికులకు ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీని అందించే చర్యలు తీసుకోవాలని కోరారు. నూలు, సిల్క్ వంటి ముడి సరుకును సబ్సిడీ ద్వారా చేనేత వస్త్ర ఉత్పత్తిదారులకు అందించాలని కోరారు. నేతన్న నేస్తం పదకాన్ని అర్హులైన చేనేత అనుబంధ వృత్తులకు కూడా వర్తింపజేయాలని కోరారు. చీరాల మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిద్ధి బుచ్చేశ్వరరావు, గుత్తి ఆంజనేయులు, బట్టా శ్రీను, పసుమర్తి శీను, పసుమర్తి మల్లికార్జున, డి రాజా, బట్టా రాంబాబు ఉన్నారు.

కార్గిల్ విజయోత్సవానికి 25 సంవత్సరాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి


హాజీబాషా (ఫైల్)

బాపట్ల – వెల్లటూరు మార్గంలోని చిన్న గ్రామం చెందోలు. అది ముందు నుంచీ సైనిక జవాన్ల పల్లె. 2వ ప్రపంచ యుద్ధం నుంచీ ఈ గ్రామానికి సైనిక రంగంలో మంచి గుర్తింపు వుంది. రక్షణ శాఖలో అనేక కీలక స్థానాల్లో ఈ గ్రామానికి చెందిన వారు పని చేస్తున్నారు. ప్రస్తుతం 16మంది గ్రామ యువకులు కార్గిల్లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. వారిలో వీర మరణం పొందిన తొలి యువకుడు హాజీ బాషా. చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న హాజీబాషాకు చిన్నప్పట్నించి ఆటలంటే యిష్టం. ఆటల్లో మంచి ప్రతిభ చూపేవాడు. బాగా క్రికెట్ ఆడేవాడు. 1993లో ఆర్మీలో చేరాక అతడు తన ఉద్యోగాన్ని చూసుకొని ఎంతో గర్వించేవాడు. సైనికుడిగా పని చేయడం కష్టమైన పనే అయినప్పటికీ దేశసేవ చేసే అవకాశం అందరికీ దొరకదని చెప్పేవాడు. చిన్న వయసులో ఎంతో సాహసం ప్రదర్శించి ప్రాణాలర్పించిన హాజీబాషాని చూసి చందోలు గ్రామమంతా గర్వపడుతోంది. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మా నాన్న హాజీ మస్తాన్కిగానీ, 17ఏళ్ల పాటు భారత సైనిక జవానుగా పని చేసిన నాకుగానీ భారతదేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టేంత అదృష్టం కలగలేదు. నా ఒక్కగానొక్క బిడ్డ ఆ పని చేశాడు. జాతి కోసం ప్రాణాలర్పించిన నా బంగారు తండ్రిని చూసి నేను గర్వపడుతున్నాను' అని మాజీ సైనికుడు షేక్ అబ్దుల్ రహమాన్ అన్నారు. ఆ మాటలు అనుకున్నప్పుడు ఆయన కళ్ల నుంచి కన్నీళ్లు రాలిపడ్డాయి.

తాతావారిపాలెంలో జ్వరాలపై సమీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సూర్యపల్లి పంచాయతీలోని తాతావారిపాలెంలో గత కొన్ని రోజులుగా జ్వరాలు సంభవించి ప్రజలు అవస్థలు పడుతున్న దృష్ట్యా ఇన్చార్జి తహశీల్దారు శ్రీనివాసరావు గ్రామాన్ని సందర్శించారు. వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు నాయకులతో సమీక్షించారు. గ్రామంలో కొన్ని రోజులుగా మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలటానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రైతు వారి కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ప్రతి ఇంటికి పశువులు ఉండటం వలన అక్కడ పశువుల వ్యర్థాలు నిలువ చేయడమే కాక మురురు నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు, జ్వరాలకు నిలయంగా మారాయని వివరించారు. తక్షణమే గ్రామంలో పారిశుధ్య నిర్మూలన చేపట్టాలని ఆదేశించారు. సున్నం, బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. జ్వర పీడితులసర్వే చేసి


మాట్లాడుతున్న ఇన్చార్జి తహశీల్దారు శ్రీనివాసరావు

వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రామస్తులు ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నిలవ లేకుండా చూసుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. సర్పంచి మోర్ల సత్యనారాయణ, టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు, విఆర్ఓ సురేష్ పాల్గొన్నారు.


మధుసూదన ప్రసాద్ బృంధానికి సన్మానం

మధుసూదనప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక వినాయక ఆలయం నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు 15రోజుల్లో 400 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు యువత అధికార ప్రతినిధి కనకాల మధుసూధన ప్రసాద్ సన్మాన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయనతోపాటు 400 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్న 60మంది సభ్యులను సన్మానించి మెమొంటోలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, ధోనిపూడి బుజ్జి, దూలపూడి కృష్ణ, పోతర్లం కోటేశ్వరరావు, కోసూరు అప్పయ్య, రాఘవరావు, ప్రసాద్ పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న రేడియో ఆర్టిస్ట్ సాంబయ్య

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

'బ్యాంకుల జాతీయకరణ, సామాన్యులకు అందుబాటులో బ్యాంకు సేవలు' అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు రేడియో ఆర్టిస్ట్ పిన్నక సాంబయ్య తెలిపారు. స్థానిక వైఆర్ హై స్కూల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఝాన్సీ లక్ష్మీబాయి గ్రూపుకు మొదటి బహుమతి, అంబేద్కర్ గ్రూపుకు ద్వితీయ బహుమతి, ఎంకె గాంధీ గ్రూపుకు తృతీయ బహుమతి లభించినట్లు తెలిపారు. హెచ్‌ఎం ఈదర రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు సాంబయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి కవిత, డి లక్ష్మీప్రసన్న, డి కల్యాణి, డి రమాప్రియ, వై మంగాదేవి, ఎ శ్రీనివాసరావు, వై ప్రభాకరరావు పాల్గొన్నారు.

నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు


ప్రజాశక్తి - చెరుకుపల్లి

నారు మడిని 10నుండి 12రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ సూచించారు. మండలంలోని ఆరేపల్లి, తూర్పు పాలెం పంచాయతీల్లో వరి నారు మడులను ఆయన గురువారం పరిశీలించారు. నారుమడిలో నీరు పెట్టడానికి, వదిలి వేయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఐదు సెంట్ల వరి నారు మడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌ను దుక్కిలో కలియ దున్నాలని తెలిపారు. ఈ మేరకు పాటించాల్సిన సస్య రక్షణ చర్యను రైతులకు అవగాహన కల్పించారు.

ఎఎంసి ఛైర్మన్‌గా మాలపాటి..?

ప్రజాశక్తి-మార్కాపురం
తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత వైసిపి ప్రభుత్వంలో భర్తీ చేసిన నామినేటెడ్ పదవులన్నీ ఖాళీ అవుతున్నాయి. టిడిపి అధిష్టానం కూడా పార్టీలో చురుకైన పాత్ర పోషించిన వారిని మాత్రమే నామినేటెడ్ పదవుల్లో ఉంచాలని భావిస్తోంది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలోనూ అదే జరుగుతోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోంది.

మార్కాపురంలోనూ కీలకమైన వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి పేరు వినపడుతోంది. ఆయనతో పాటు పలువురి పేర్లను డైరెక్టర్లుగా సూచిస్తూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.


మాలపాటి వెంకటరెడ్డి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సన్నిహితుల్లో మాలపాటి వెంకటరెడ్డి ఒకరు. టిడిపి అధికారంలో ఉన్నా... లేకున్నా ఆయన టిడిపిలోనే కొనసాగారు. పార్టీలో మాలపాటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పార్టీ కార్యక్రమాలకు ఆర్థికంగా సాయం అందించే వ్యక్తిగా మాలపాటికి పేరుంది. కందుల నారాయణరెడ్డి గెలుపు కోసం ప్రతి ఎన్నికల్లో కష్ట పడ్డారు. ఈ ఎన్నికల్లోనూ ఆయన కృషి ఎనలేనిది. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఒక్కసారి మినహా మిగిలిన అన్నిసార్లు మార్కాపురం పట్టణానికి చెందిన వ్యక్తులకే అవకాశం దక్కింది. ఎఎంసి ఛైర్మన్‌గా అత్యధిక సార్లు మార్కాపురంలోని తూర్పువీధి వ్యక్తులకే లభించింది. మాలపాటి వెంకటరెడ్డి కూడా అదే వీధికి చెందిన వ్యక్తి. మాలపాటి వెంకటరెడ్డి ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారిగా కొనసాగుతున్నా... ఆయన రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. ఇక్కడి రైతులతో సంబంధాలు కలిగిఉన్నాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి అన్ని విధాలుగా అర్హత ఉందని టిడిపిలోనూ చర్చ జరుగుతోంది. ఎఎంసి ఛైర్మన్‌గా మాలపాటి పేరు సూచిస్తూ ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. జిల్లా స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని, రాష్ట్ర స్థాయికి తీసుకు వెళ్లాల్సిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. యర్రగొండపాలెం మండలం వెంకటాద్రి పాలెం పంచాయతీలోని గిరిజనుల పునరావాస కాలనీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశం నిర్వహించిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో తాగునీటి సమస్య ఉందని, ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు సరిపోవటం లేదని గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్ఓఎఫ్ఆర్ భూములలో సాగుకు అవసరమైన నీటి వసతి కల్పించాలని గిరిజనులు కోరగా బోరు వేసి నీటి సౌకర్యం కల్పించేలా అటవీ శాఖ అధికారులతో చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని పిటిజి గిరిజన ప్రాంతాలలో పాఠశాలలు, అంగన్‌వాడీలు, తాగునీటి కోసం బోర్‌వెల్స్, ఇతర మౌలిక సదుపాయాల


చెంచులతో ముఖాముఖి నిర్వహిస్తున్న కలెక్టర్

కల్పనకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఆయా ఆవాసాల వారీగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్రారెడ్డికి కలెక్టర్ సూచించారు. ముందుగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేలా యర్రగొండపాలెంలోని అటవీశాఖ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ మొక్కను నాటి ప్రజలలో స్ఫూర్తిని నింపారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఎల్‌డిఒ సాయి కుమార్, హౌసింగ్ డిఇ సురేష్, వెంకటాద్రిపాలెం సర్పంచి బోడా శ్రీశైలపతి నాయుడు, మాజీ సర్పంచి చెవుల అంజయ్య, ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు.

టాగూర్ సాంస్కృతిక సముదాయాల పనితీరుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో టాగూర్ సాంస్కృతిక సముదాయాల పనితీరు, కొత్త వాటి ఏర్పాటుపై ప్రభుత్వ చర్యల గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ సమాధానమిస్తూ ఈ పథకంలో సంగీతం, నత్యం, నాటకం, సాహిత్యం, లలిత కళలు లాంటి సాంస్కృతిక రంగాలలో ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంతో ప్రవేశ పెట్టారన్నారు. దేశంలో ఈ పథకంలో గత ఇదు సంవత్సరాలలో రాష్ట్రాల నుంచి 26 టాగూర్ సాంస్కృతిక సముదాయాల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలు ఆమోదించ బడ్డాయన్నారు. అందులో ఆర్థిక సహాయం పొందిన 8 సముదాయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. తిరుపతిలో ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలు సిఫార్సు చేసి ఆమోదించాల్సి ఉందన్నారు. ఈ పథకంలో ప్రస్తుతం ఉన్న భవనాల పునరుద్ధరణ, పునర్నిర్మాణం, స్థాయి పెంపు, ఆధునీకరణ, విస్తరణ వంటి పనులు, రాష్ట్రాల రాజధానులు, ముఖ్య పట్టణాలలో కొత్తవాటి నిర్మాణం చేస్తున్నారని మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తెలిపారు.


నీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు

నీటి కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
యర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి గ్రామంలో గుక్కెడు నీళ్ల కోసం మహిళలు బిందెలతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ గ్రామంలో నాలుగు డీప్‌బోర్లు ఉన్నా రెండు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. మిగతా బోర్లలో నీళ్లు గుతుకుతు వస్తున్నాయి. ఒక్కో బింద నిండేందుకు గంట సమయం పడుతుంది. దీంతో గత్యంతరం లేక మహిళలు నీటి కోసం పొలాల బాట పడుతున్నారు. త్రీఫేస్ కరెంట్ వచ్చే వరకూ పడిగాపులు కాచి వ్యవసాయ బోర్ల దగ్గర నీళ్లు పట్టుకొని కిలోమీటర్లు పొడవునా నడిచి తెచ్చుకుంటున్నారు. గతంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు.కొంత కాలం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపి వేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఎందుకు నిలిపి వేశారో తమకు అర్థం కావడం లేదని మహిళలు వాపోతున్నారు. పనులు మానుకొని నీటి కోసమే నిరీక్షించాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గంజివారిపల్లిలోని ఎస్‌సిపాలెంలో కూడా నీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి సమస్య తీర్చాలని అనేకసార్లు అధికారులకు, నాయకులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే లేడని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు. నీటి సమస్య గురించి గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డిని వివరణ కోరగా డీప్‌బోర్లు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


అన్నా క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

15 నుంచి అన్నా క్యాంటీన్లు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా
అన్నా క్యాంటీన్లను ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. అన్నా క్యాంటీన్ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. గత అనుభవాలపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పడగానే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసే సమయంలో అన్నా క్యాంటీన్లు పునరుద్ధరిస్తామని ప్రకటించారన్నారు. అందులో భాగంగా అన్నా క్యాంటీన్ల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు కేవలం ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం పెట్టనున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి పట్టణ ప్రాంతాలలో అన్నా క్యాంటీన్లు పునరుద్ధరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 2 నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్వాతంత్ర దినోత్సవం నుంచి ఐదు రూపాయలకే భోజనం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బాపట్ల పట్టణంలోనే గతంలో రోజుకు సుమారు 500 మంది భోజనం చేసేవారని తెలిపారు. కలెక్టర్ వెంట బాపట్ల ఆర్‌డిఒ రవీందర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా

పశువులకు టీకాలు వేయించాలి

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా
లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు తెలిపారు. పశువులకు లంపీ స్కిన్ సోకితే రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. ఈ వ్యాధి అతివేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. పాక్స్ విరిడే కుటుంబం కాప్రిపాక్స్ జాతి వైరస్ వల్ల ఈ వ్యాధి సక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి అన్ని వయసుల ఆవు, గేదెల్లో కనిపిస్తుందన్నారు. జోరీగలు, దోమలు, ఈగలు, పిడుదులు లాంటి రక్తాన్ని పీల్చే పురుగులు కుట్టడం ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. వర్షాకాలంలో వ్యాధి వ్యాప్తి ఎక్కువగా వుంటుందన్నారు. వ్యాధి సోకిన పశువులో 105 డిగ్రీల జ్వరం ఉంటుందన్నారు. కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు నుంచి స్రావాలు, నోటి నుంచి చొంగ కారుతుంది. వ్యాధి తీవ్రంగా సోకిన పశువు శరీరంపై కణతలు,బొడిపెలు ఏర్పడతాయన్నారు. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజుల వరకూ ఉంటుందన్నారు. బొడిపెలు పగిలి చర్మం మీద గాయాలు ఏర్పడతాయన్నారు. వ్యాధి సోకిన పశువులు నీరసించి మేత, నీరు తీసుకోవని తెలిపారు. పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. చూడి పశువులు ఈసుకుపోతాయి. తక్షణమే వైద్యం అందించకపోతే పశువు మరణించే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలున్న పశువులను వేరుచేసి పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్సనందించాలన్నారు. లక్షణాలను బట్టి యాంటీ పైరెటిక్స్, యాంటీ బయోటిక్స్, యాంటీ హిస్ట మినిక్స్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ మందులు వినియోగించాలన్నారు. పశువు నీరసం నుండి కోలుకునేందుకు బి.కాంప్లెక్స్ మందులు ఇవ్వాలన్నారు. పశువులకు తేలికగా జీర్ణమయ్యే రాగి జావ లాంటి ఆహార పదార్థాలను అందించాలన్నారు. వ్యాధి సోకిన పశువులను ఇతర ప్రదేశాలకు రవాణా చేయరాదన్నారు. సంతల్లో కొనుగోలు, అమ్మకం చేయరాదన్నారు. వ్యాధి గ్రస్త పశువులను విడిగా కట్టేసి మేత, నీరు వేరే తొట్లెల్లో అందించాలన్నారు. కీటక నియంత్రణ మందులు పిచికారి చేయాలన్నారు. దోమ తెరలు వినియోగించాలన్నారు. వేపాకు పొగ వేయలన్నారు. ఈ వ్యాధి నివారణ కోసం జిల్లాలో 27 వేల తెల్ల పశువులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశుపోషకులు పశు సంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు.


లంపీ స్కిన్ వ్యాధి సోకిన ఆవు

కూరగాయల మార్కెట్ మాయాజాలం

- రైతు వద్ద సొరకాయ రూ.2లు మార్కెట్లో వినియోగదారుడికి రూ.30
- నష్టపోతున్న సొరరైతులు

ప్రజాశక్తి - పంగులూరు

మార్కెట్ మాయాజాలంతో సొరకాయల రైతులు విలవిల్లాడుతున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించినప్పటికీ ఫలితం దక్కటం లేదని వాపోతున్నారు. ప్రకృతి కరుణించి, వాతావరణం కలిసివచ్చి పంట బాగా పండింది. కానీ మార్కెట్లో ధర లేకపోవడంతో నష్టాల చూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎలాంటి తెగుళు ఆశించకుండా, కాయలు బాగా ఉన్నా మార్కెట్లో సొరకాయ రూ.2లకు మించి ధర పలకడం లేదని మండలంలోని కళ్ళంవారిపాలెం గ్రామానికి చెందిన కల్లం సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద కొన్న సొరకాయలను బయట మార్కట్లో వినియోగదారుడుకి కాయ రూ.20 నుండి రూ.30 వరకు అమ్ముతున్నారని చెప్పాడు. తాను ఎకరా 30 సెంట్లలో గత మార్చి నెలలో సొరకాయలు సాగు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు మిర్చి తోట వేసి నష్టపోయి, మిర్చి మొత్తం తీసివేసి సొరపంట వేసినట్లు తెలిపారు. మిర్చికి నష్టపరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. చేసేది లేక సొర పంట సాగు చేశానన్నాడు. సొర విత్తనాలు (మైకోరకం) రూ.5వేలు అయ్యాయని, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయం కలిపి ఇప్పటికీ రూ.40వేలు పెట్టుబడి పెట్టానని చెప్పాడు. నీటి తడి కోసం బావి నుండి డీజిల్ మోటార్తో 1200 అడుగుల పైపులు వేసి చేనుకు నీళ్ల పెడుతున్నామని నీటి కష్టాలు చెప్పారు. ఇంత కష్టపడి పైరును కాపాడుకొని కాయలు కాయిస్తున్న, అవి ఏమాత్రం తమకు ఉపయోగపడటం లేదని చెప్పారు. నాలుగు రోజులకు ఒకసారి సొరకాయలు కోయాల్సి ఉంటుందని అన్నారు. ప్రారంభంలో మూడు ట్రిప్పులు 60 బస్తాలు సొరకాయలు కోసి మార్టూరు మార్కెట్కు తీసుకెళ్తే ఈ కాయలు ఎవరూ కొనడం లేదని, కాయలను ఆవులకు పోసామని చెప్పి మొత్తానికి రూ.750 ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా సొర కాయలు కొయ్యటానికి రోజుకు నలుగురు కూలీలు కావాలని, ఒక్కొక్కరికి రూ.250 కూలి ఇస్తున్నామని చెప్పారు. ఆ విధంగా కూలీల కోతకు రోజుకు రూ.వెయ్యి ఖర్చువుతుందని, ఒక్కో ట్రిప్పుకు వెయ్యి కాయల వరకు వస్తాయని, వీటిని పది బస్తాల్లో తీసుకెళ్లాలని చెప్పారు. ఒక్కో కాళీ బస్తా రూ.10 ధరకు కొంటున్నామని, ఈ కాళీ బస్తాలు రూ.200 అవుతాయని అన్నారు. వాటిని మార్టూరు కూరగాయల మార్కెట్ యార్డుకు తీసుకెళ్లేందుకు ఆటోకు రూ.వెయ్యి బాడుగ అవుతుందని అన్నారు.



సొరకాయలు చూపుతున్న రైతు కల్లం సుబ్బారెడ్డి

రూ.2,200 ఒక్కో ట్రిప్పు ఖర్చు అవుతుంటే వెయ్యి కాయలను రూ.2 లెక్కన అమ్మితే రూ.2వేలు మాత్రమే వస్తున్నాయని అన్నారు. ట్రిప్పుకు రూ.200 నష్టపోతున్నామని చెప్పారు. తాము కష్టపడి పండించిన పంట ఫలితం తాము తినలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అవి ప్రజలకు కూడా కొనాలంటే భారంగానే ఉంటున్నాయని అన్నారు. ఫలితం మాత్రం మార్కెట్ వ్యాపారులు, మధ్య దళారులకు అందుతుందని తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటం వలన ఏ పంట పండించిన చివరికి రైతు నష్టాల పాలు అవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ మాయాజాలంలో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు.

ప్రకృతి పంటల సాగుతో రైతుకు రాబడి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకృతి పంటల సాగు రైతులకు లాభాల పంట పండిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని పిన్నిబోయిన వారిపాలెం, నందిరాజుతోట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటిస్తూ పంటలు సాగుచేస్తున్న బి శరత్ చంద్రబోస్, జె చలమయ్యకు చెందిన 28 ఎకరాల్లో (పిఎండిఎస్) తొలి దశ వానకు ముందే విత్తనం విత్తే పద్ధతి అనుసరిస్తున్న వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వానకు ముందే విత్తనాలు వెదజల్లే ప్రత్యేక వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించాలని అన్నారు. ప్రతి రైతు ప్రధాన పంట వేయడానికి ముందుగా రబీ పంట నూర్పిడి అయిన వెంటనే పచ్చిరొట్ట, పప్పు జాతి, చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, ఆకు కూరలు, కూరగాయలు వంటివి 30రకాల జాతులకు చెందిన విత్తనాలను పొలంలో వెదజల్లాలని అన్నారు. నాలుగైదు రోజుల తరువాత చల్లిన విత్తనాలను భూమిలో కలియ దున్నాలని అన్నారు. తద్వారా పెరిగిన మొక్కలతో భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగి ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల



ప్రకృతి పంటల సాగుపై సూచనలిస్తున్న ఎడి రామకృష్ణ

పోషకాలు అందుతాయని అన్నారు. దీంతో ఆరోగ్యమైన పైరు ద్వారా నాణ్యమైన అధిక వ్యవసాయ ఉత్పత్తులు సాధించవచ్చని అన్నారు. ఈ రకమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పశుగ్రాసం, ఆకు కూరలు, కూరగాయల ఉత్పత్తుల ద్వారా రైతులు ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు. జిల్లాలో అనువైన ప్రాంతాల్లో ఈ వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు వి వాణిశ్రీ, ఎఒ ఆర్ చంద్రశేఖర్, వివిఎ నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వైవి శివరావు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో రోడ్డు నిర్మాణంపై విచారణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంకలో గత నెల 17న సురేష్కు చెందిన భూమిలో నుండి రైతులు అక్రమంగా దౌర్జన్యంతో రహదారి ఏర్పాటు చేసుకోవడం పట్ల రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులు దౌర్జన్యంగా దళితుని అసైన్ భూముల గుండా అక్రమంగా రహదారి ఏర్పాటు చేయటమే కాక అడ్డుకున్న ఎన్నం సురేష్ అతని కుమారుడు, తల్లిపై అగ్ర కులాల వారు దాడులు చేసినప్పటికీ వారిపై స్థానిక పోలీ సులు కనీసం కేసు నమోదు చేయక పోవటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 17, 18 తేదీల్ఓ రెండు విడతలుగా రహదారి నిర్మించే సమయంలో అడ్డుకున్న దళితులను దాడులు చేసి తీవ్రంగా గాయపరిచినప్పటికీ పోలీసు వ్యవస్థ ఉన్నట్లా? లేనట్లా? అని ఆయన ప్రశ్నించా రు. దళితుల ఆస్తులు, ప్రాణాలను కాపాడవలసిన పోలీ సులు, రెవెన్యూ అధికారులు అగ్రకులాలకు తొత్తులుగా మారితే వారికి ఏ విధంగా రక్షణ కలుగుతుందని ఆయన ప్రశ్నించారు. రెవిన్యూ అధికారులతో పాటు పోలీసులు రక్షణగా ఉండి అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారిని తొలగించి బాధ్యత దళిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 109 సెక్షన్ కింద అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నం సురేష్ తండ్రి పార్వతీరావుకు ప్రభుత్వం ఈ భూమికి పట్టా ఇచ్చిందని ఆయన మరణానంతరం కుమారుడు సురేష్కు ఈ భూమి బదలాయింపు చేయ డమే కాక వన్ వి అడంగల్, పాస్ పుస్తకం వంటివి ప్రభు త్వ మంజూరు



విచారణ చేస్తున్న ఎస్సి, ఎస్టి కమిష్ చైర్మన్ విక్టర్ప్రసాద్

చేసినట్లు తెలిపారు. అయినప్పటికి రైతులు వారికి ఉన్న పాత రహ దారులను వదిలేసి దళితుల భూ ముల్లోనే దౌర్జన్యంతో రోడ్డు వేయటం పట్ల ఆయన విస్మయ వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబంపై దాడి ఘటన పిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని చైర్మన్ ఎదుట సురేష్ వాపోయాడు. సాక్షాత్తు ఎస్సీ కమిషన్ చైర్మన్ సమక్షంలోనే అగ్రవర్ణాలకు అండగా ఉంటున్న కొందరు దళితులు వచ్చి నానా విధాలుగా మాట్లాడటం పట్ల చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే దళితులకు రక్షణ కల్పించే విధం గా దాడులు చేసిన వారిపై, వారికి సహకరించిన వారిపై కేసుల నమోదు చేసి అక్రమంగా నిర్మించిన రహదారిని తొలగించాలని చెప్పారు. లేకుంటే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. డిఎస్పి, సిఐ రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాస రావు, ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఇన్చార్జి తహశీల్దారు శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడాతున్న జి కరుణాకర్

యువత మనో ధైర్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - చీరాల

యువత మనో ధైర్యంతో ముందుకు సాగాలని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఐఎస్ఐ కో ఆర్డినేటర్ జి కరుణాకరావు అన్నారు. 'నేను నా సమాజం' అనే అంశంపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జులై 22నుండి 24వరకు బెంగుళూరు ఇంటర్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహాయ సహకారాలతో జెఎంజె సోషల్ సర్వీసు గ్రామీణ యువతకు 3రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. సమాజం పట్ల మన బాధ్యత ఏమిటని అంశంపై యువతకు కొన్ని సూచనలు తెలిపారు. యువతలో మనోధైర్యాన్ని నింపి యువత సందేహాలకు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జిఓస్ హెడ్స్, జెఎంజె ఎస్ఎస్సి డైరెక్టర్ సుజాత, కార్డ్స్ డైరెక్టర్ కోటేశ్వరరావు, కెసిటి డైరెక్టర్ ఉమాదేవి, ఎస్సిజిఎం డైరెక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.



కావూరులో పారిశుద్ధ్య వారోత్సవాలలో ర్యాలీ

పారిశుద్ధ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించేలా అధికారులకు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు సహకరించి తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా మండలంలోని కావూరు గ్రామంలో ర్యాలి నిర్వహించారు. ఆగస్టు 10వరకు పారిశుద్ధ్య వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లి జ్యోతి రవికుమార్ పాల్గొన్నారు. ఈనెల 26న చెరుకు పల్లి, గుల్లపల్లి, 27న తూర్పుపాలెం, ఆరేపల్లి, 29న కన గాల, ఆళ్లవారిపాలెం, 30న రాజోలు, 31న బలుసుల పాలెం, ఆగష్టు 5న తుమ్మలపాలెం, 6న ఆరుంభాక, 7న రాంబట్లపాలెం, కుంచలవారిపలెం, 8న నడింపల్లి, పొన్నపల్లి, 9న గూడవల్లి పంచాయతీల్లో పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జాతీయ విద్యా విధాన వార్షికోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా డిఇఒ, సమగ్ర శిక్ష ఎపిసి సూచనల మేరకు తిమ్మాయిపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాలు గురువారం నిర్వహించారు. విద్యార్థులతో సాంస్కృత కార్యక్రమాలు పిడి సుబ్బారావు, శారద ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యార్థులతో కలసి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. తిలకష్టమాహిష బంధం అనే స్క్రిప్టును 10వ తరగతి విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భిన్నత్వంలో ఏకత్వమే ప్రధాన లక్ష్యంగా కలిగిన మన భారతీయ సంస్కృతిని విద్యార్థినీ, విద్యార్థులు కలిగి ఉండాలని చెప్పారు. భావి భారత పౌరులుగా ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్గా గుర్తించగలగాలని అన్నారు. వివిధ భాషలు మాట్లాడే విధంగా పిల్లలను ప్రోత్సహించాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలొ పాఠశాల స్టాఫ్ సెక్రటరీ వి సుధాకర్, విద్యా కవిటి చైర్మన్ తోకల ఉమాదేవి, సిఆర్ఎంటిఎం రమేష్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఆమంచి స్వాములు

ఆమంచి స్వాములు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేటపాలెం

జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దేశాయపేట పంచాయతీ నీలకంఠపురం వృద్ధ శరణాలయంలో అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆమంచి స్వాములు మొక్కలు నాటారు. వృద్ధుల సమక్షంలో పుట్టిన రోజు కేకు కట్ చేశారు. చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం, పళ్ళు, బ్రేడ్లు పంపిణీ చేశారు. పందిళ్లపల్లిలోని స్వాములు నివాసం వద్ద అన్నదానం చేశారు. అభిమానుల మధ్య జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో చుండూరి రవి, సాయని ఈశ్వర్, కరణం బాలకృష్ణ, రఫీ, చుండూరి మహేంద్ర, సోమన మారుతీ, రెహ్మాన్, సాలెహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజాధిబోరా

పెన్షన్ పంపిణీకి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సోషల్ వెల్ఫేర్ జిల్లా డైరెక్టర్ కె రాజాదెబోరా అధ్యక్షతన స్థానిక సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్, పెన్షన్ పంపిణీ సక్రమంగా జరిగేలాగా సరియైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఫీజు రీయింబర్స్మెంట్ సంబంధించి పెండింగులో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని, సమయానికి ఆఫీసుకు వచ్చి సమయపాలన పాటించాలని, అటెండెన్స్ వేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ, జెవి బి మల్లికార్జున, కె సత్యనారాయణ పాల్గొన్నారు.



వాగోలు కోటేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం

సహృదయ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం గ్రామానికి చెందిన వాగోలు కోటేశ్వరరావు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయినారు. ఈ విషయం తెలుసుకున్న సహృదయ ఫౌండేషన్ రూ.10వేల విలువైన నిత్యవసర సరుకులను ఎంపిడిఒ లక్ష్మి కుమారి, సర్పంచి టి కృష్ణమోహన్ చేతుల మీదగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి కుమారి మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి భరోసా ఇవ్వడం కోసం అడిగిన వెంటనే సహృదయ ఫౌండేషన్ సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. యుఎస్ఎలో ఉద్యోగం చేసుకుంటూ తెలుగువారికి ఏ కష్టం వచ్చినా సహృదియా ఫౌండేషన్ సహకారం అందిస్తూ ఈ ప్రాంతంలోని పేద ప్రజలకు చేయూతనిస్తున్న సహృదయ ఫౌండేషన్ ప్రతినిధులకు సర్పంచి కృష్ణమోహన్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి ప్రభు, సిపిఎం మండల నాయకులు వేములపల్లి వెంకట రామయ్య, సుబ్బారావు, గ్రామ పెద్దలు వి శ్రీనివాసరావు, సుబ్బారావు, కోటేశ్వరావు, రమేష్ పాల్గొన్నారు.



డయేరియాపై అవగాహన ర్యాలీ

డయేరియా పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

తీర ప్రాంత గ్రామాల ప్రజలు డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డిఎల్‌పిఒ పులి శరత్ బాబు అన్నారు. మండలంలోని అడవి పల్లెపాలెం, పాండురంగాపురం గ్రామాల్లో గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలని అన్నారు. కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితం కాకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మంజూరు భాష ఆధ్వర్యంలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. డయేరియా పట్ల ప్రజలను చైతన్యం చేస్తూ విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి కిరణ్ కుమార్, ఎంఆర్‌సి శశి కిరణ్, పంచాయతీ కార్యదర్శి బి రాజశేఖర్, అంగన్‌వాడి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ ఐక్య సంఘాల సభ్యులు ఆయా గ్రామాల్లో ప్రతి ఇంట సర్వే నిర్వహించాలని వెలుగు అధికారి సత్యభామ అన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి కుటుంబ స్థితిగతులు తెలుసుకొని నమోదు చేయాలని అన్నారు. విజయవాడ వెలుగు ప్రధాన కార్యాలయం నుంచి నిర్వహించిన వీక్షణ సమావేశంలో వెలుగు సభ్యులు, అధికారులకు ఆమె సూచనలు చేశారు. గ్రామాల్లో మహిళలు చైతన్యవంతులై ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అందుకు సర్వే నిర్వహించి అందరికీ తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం మోహనరావు, గ్రామ సమైక్య సంఘం సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

రైతులకు మ్యూటేషన్ తిప్పలు

నిలిచిన భూముల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత వైసిపి ప్రభుత్వంలో సర్వే పూర్తయిన గ్రామాల్లో కొన్నింట్లో అంతర్జాలంలోని వెబ్ లాండ్ సమస్యతో భూములు మ్యూటేషన్ కాకపోవటంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈ సమస్య ఉండటంతో భూములుండి ఆర్థిక సమస్యలతో అప్పులతో ఇబ్బందులు పడుతున్న రైతులు తమకున్న కొద్దిపాటి పొలాలు వేరే వారికి విక్రయించాలని అనుకున్నా అది జరగక అమ్మకం కుదరక యాతన పడుతున్నారు. గత ఆరు నెలలుగా ఈ సమస్య వెంటాడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ప్రజాశక్తి దృష్టికి తెచ్చారు. ఇంకొల్లు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని గ్రామాలతో పాటు పోరుగున ఉన్న వివిధ మండలాలకు సంబంధించిన 40 గ్రామాలకు ఇంకొల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే క్రయ విక్రయాలు జరుగుతూ ఉంటాయి. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 10 గ్రామాలకుపైగా రైతులు ఈ సమస్యతో సతమవుతున్నట్లు చెబుతున్నారు. సమస్యను ప్రస్తుత ప్రభుత్వంలోని నూతన రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఉన్నట్లు తెలి పారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రి అనగానికి వివరించాం

ఇంకొల్లు సబ్ రిజిస్టర్ పరిధిలోని ఇంకొల్లు మండలం గంగవరం, మద్దిరాల, ముప్పాళ్ళ గ్రామాలతో పాటు నుజిల్లాపలి, తదితర గ్రామాల్లో మ్యుటేషన్ సమస్య ఉందని గంగవరంకు చెందిన రైతు కరి అప్పారావు తెలిపారు. ప్రస్తుత రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి ఇటీవల తీసుకు వెళ్లినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న గంగవరం రైతు వల్లేటి సతీష్

ఆరు నెలలుగా నిలిచిన క్రయవిక్రయాలు

గత ప్రభుత్వంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో మ్యుటేషన్ సమస్య ఏర్పడటంతో తమ భూములు, స్థలాల క్రయ విక్రయాలు చేయాలన్న కుదరటం లేదని గంగవరంకు చెందిన రైతు వలేటి సతీష్ అన్నారు. గత ఆరు నెలలుగా కొన్ని గ్రామాల్లో ఈ సమస్య ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో రైతులకు అవస్థలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గుతుందని అన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్య సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలని ఎస్‌పి దామోదర్ పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యక్రమాలకు అడ్డుకట్ట వెయ్యాలని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దర్శి సర్కిల్ పరిధిలోని తాళ్ళూరు, ముండ్లమూరు, దర్శి పోలీస్ స్టేషన్లను, ఒంగోలు సబ్ డివిజన్‌లోని చీమకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. పోలీసు స్టేషన్‌లోని లాకప్, రిసెప్షన్, కంప్యూటర్ రూమ్, జిడి, రికార్డుల నిర్వహణ, పోలీసు స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. పని చేయుచున్న సిబ్బంది వివరాలు, విధి నిర్వహణ పని తీరు గురించి ఆరాతీశారు. ప్రతి స్టేషన్ ఆవరణను పచ్చదనం పెంపొందించాలని చెప్పారు. ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. పెండింగులో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. స్టేషన్ రికార్డ్స్ అన్ని సక్రమంగా నిర్వహించాలని అన్నారు. మహిళలు, పిల్లలు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నేరాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మురం చేయాలన్నారు. అసాంఘిక చర్యలపై అడ్డుకట్ట వెయ్యాలని అన్నారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు విజిబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహన దారులు, ప్రజలకు అవగాహన చేపట్టాలని అన్నారు. స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని చెప్పారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలను రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో బీట్లు తిరిగే సమయంలో చెడు నడత, హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని చెప్పారు. వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరగాళ్లు చూపే మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్ నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, సిబ్బందికి ఏమన్నా సమస్యలు ఉంటే చెప్పాలని అడిగి తెలుసుకున్నారు.సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట తాళ్ళూరు ఎస్ఐ విజయకుమార్, దర్శి ఎస్ఐ సుమన్, చీమకుర్తి ఎస్ఐ వెంకట కృష్ణయ్య, చీమకుర్తి పిఎస్ఐ రాజమోహనరావు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

108లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చీరాల

108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలట్, డ్రైవర్, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ తెలిపారు. ఈఎంటికి జిఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బిఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసి ఉండలని తెలిపారు. పైలట్ ఉద్యోగంకు 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్, 35ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, ఇంగ్లీష్ చదవడం, వ్రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 27లోపు 108 కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 83095 30078, 88851 07040 నెంబర్లను సంప్రదించాలి తెలిపారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రైతు వెంకటేశ్వర్లు

విద్యార్థులకు రైతు సాయం

ఉచితంగా పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

ఆయన సామాన్య రైతు. 80ఏళ్ల వయస్సులో ఒక చిన్న పూరింట్లో నివాసం ఉంటున్నాడు. తనకు చదువు లేకపోయినా ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే ఆశయంతో తనకున్న ఎకరం పొలం కౌలుకిచ్చి దానిపై వచ్చే ఆదాయంతో 18ఏళ్లుగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన సాధారణ రైతు చిమట వెంకటేశ్వర్లు తనకున్న ఎకరం పొలాన్ని కౌలుకిచ్చాడు. దానిపై వచ్చే కౌలు ఆదాయంతో తాను జీవనం సాగిస్తూ సామాజిక సేవ చేయాలనే తలంపుతో తనకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 18ఏళ్లుగా క్రమం తప్పకుండా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉచితంగా నోటు పుస్తకాలు అందజేస్తున్నారు. గురువారం మార్టూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఎంపీపీ పాఠశాల్లోని 200 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తుండగా ప్రజాశక్తి ఆయన్ని పలకరించింది. చదువుకుంటున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో తాను ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో సైకిల్‌పై ఊరూరు తిరిగి నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వయసు పై బడటంతో తెలిసిన వారి సహాయంతో బైకుపై వచ్చి ప్రస్తుతం పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తనకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు. ఆయన సేవా నిరతిని హెచ్ఎం బి శ్రీనివాసరావు, అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు అభినందించారు.

కేసులను ఎత్తివేయటం హర్షనీయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు



ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్

గత వైసిపి ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు ఎత్తివేయటం పట్ల సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహనరావు హర్షవర్ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపట్టడం ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కని, దానిని హరించే విధంగా ఉద్యమాలు చేసిన వారిపై అక్రమ కేసులు బనయించటం సరికాదన్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం తోసిపుచ్చి సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న అనేక రకాల కేసులను ఎత్తివేయటం హర్షనియమేనని అన్నారు. ఉద్యోగులు అనేక వత్తిడులకు గురయ్యారని పేర్కొన్నారు. భవిష్యత్తులో అలాంటి ఇబ్బం దులు లేకుండా చూడాలని కోరారు. గత ప్రభుత్వ పాలన మాదిరిగా కాకుండా నేటి కూటమి పభుత్వ పాలనలో జిపిఎస్ చట్టాన్ని కూడా ఇదే అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని కోరారు. హామీలు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టారని అన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. అందుకు అనుగుణంగా సిపిఎస్‌పై విధానపరమైన చర్యలు చేపట్టి రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరారు.



మంత్రికి విన్నవిస్తున్న చేనేత నాయకులు

నిల్వ ఉన్న చేనేత ఉత్పత్తులను

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి..

మంత్రికి చేనేత నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-చీరాల

చీరాల ప్రాంతంలో పెద్దఎత్తున చేనేత ఉత్పత్తులు నిలువ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వమే ఆప్కో, లేపాక్షి తదితర సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని చీరాల మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంత్రి సవితను కలిసి విజ్ఞప్తి చేశారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య నేతత్వంలో చీరాల చేనేత నాయకుల బృందం గురువారం అమరావతి క్యాంప్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఎకనామికల్లి వీకర్స్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ మంత్రి సవితని మర్యాదపూర్వకంగా కలిసి చేనేతల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. చీరాల ప్రాంతం లోనే దాదావు రూ 50 వేల కోట్ల విలువైన చేనేత వస్త్రాల నిల్వాలు ఉండిపోయాయని మంత్రి దష్టికి తీసుకెళ్లారు. చేనేత వస్త్రాల నిల్వలు అలానే ఉండిపోతే, కొత్త గా వస్త్రోత్పత్తి చేయడం కష్టం అన్నారు. ఈ నేపథ్యంలో చేనేత వస్త్రాల నిల్వలను వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయించే దిశగా మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత వస్త్రాలపై ఉన్న జీఎస్టీ ని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో ప్రకారం చేనేతలకు కేటాయించిన 11 రకాల వస్త్రాల రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో చీరాల మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుచ్చేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీను, పసుమర్తి శీను, పసుమర్తి మల్లికార్జున, డి.రాజా, బట్టా రాంబాబు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలో విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ చర్యల్లో భాగంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 నుండి 9 గంటల వరకు రేణింగివరం రోడ్డు, నాన్ ఎక్స్రెస్ వే మెయిన్ రోడ్, కొత్త దామావారి పాలెం, బంగాళా రోడ్డు కాకానిపాలెం ప్రాంతాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. కాకానిపాలెంకు అంతరాయం కలగకుండా విద్యుత్ లైన్లు ఆ ప్రాంతాన్ని టౌన్ ఫీడర్‌కు కలపడం జరుగుతుందన్నారు. దర్శి రోడ్డు ఉత్తరము నందు భవానీ సెంటర్ నుండి పెరికపాలెం వరకు గల పాత పొట్టి స్తంభాలను మార్చుటకు గానూ ఆ ప్రాంతానికి 9 గంటల నుండి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రామశాస్త్రి వీధి, మీనాక్షి రెస్టారెంట్ వెనుక కూడా కొత్త లైన్లు ఏర్పాటు జరుగుతుందన్నారు. 9 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నలుగురు ఉపాధ్యాయుల నియామకం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

యర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు ఉపాధ్యాయులే చదువు చెబుతున్నారంటూ 'ఆ పాఠశాలలో ముగ్గురే ఉపాధ్యాయులు' అనే శీర్షికతో ఈ నెల 23న ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర స్పందించారు. వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఆ పాఠశాలకు పంపించాలని ఎంఇఒ ఆంజనేయులును ఆదేశించారు. డిఇఒ ఆదేశాల మేరకు నలుగురు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. వీరు సోషల్, ఇంగ్లీష్, బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించనున్నారు.

'విధివిధానాలు రాగానే పెట్టుబడి సాయం అందిస్తాం'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 25న 'పెట్టుబడి సాయం అందేనా' అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి యర్రగొండపాలెం ఎఒ కెవి. శేషారెడ్డి స్పందించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చినట్లు తెలిపారు. ఈ పథకం కింద ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి విధి విధానాలు రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు రాగానే రైతులకు పెట్టుబడి సాయం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి-రాచర్ల

ప్రజాశక్తి కథనానికి స్పందన

రాచర్ల మండలం, అక్కపల్లి గ్రామంలో 'ఖాళీ బిందెలతో మహిళల నిరసన' అనే వార్త బుధవారం 'ప్రజాశక్తి' టాబ్లాయిడ్‌లో ప్రచురితమైంది. ఈ వార్తకు పంచాయతీ కార్యదర్శి వి.అనిల్ కుమార్ స్పందించారు. ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయించారు.

ప్రజలందరికీ శుద్ధ జలాలను అందించాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజలందరికీ శుద్ధ జలాన్ని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. బాపట్ల పట్టణం పరిసర ప్రాంతాలలో కలెక్టర్ గురువారం విస్తతంగా పర్యటించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, నూతన ఎస్ ఎస్ ట్యాంక్ ప్రతిపాదిత స్థలం, శుద్ధ జల కేంద్రం, తాగునీటి సరఫరా విభాగం, మురుగునీటి కాలువలు, డంపింగ్ యార్డ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సంజయ్‌గాంధీ కాలనీ, కలెక్టరేట్ లోని పోలీస్ కవాతు మైదానం, తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. బాపట్ల ప్రజల తాగునీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. కొండుబొట్లపాలెం సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం 860 మిలియన్ లీటర్ల కాగా ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర బురద మేట వేసిందన్నారు. 100 ఎకరాలలో విస్తరించి ఉన్న ట్యాంకులో పూడికతీత పనులు చేపట్టాలంటే ప్రత్యామ్నాయంగా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లేదన్నారు. సమీపంలోనే 100 ఎకరాల స్థలంలో చెరువు నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రైవేట్ స్థలం కొనుగోలు చేయడానికి రూ.14 లక్షలు అవసరమవుతాయని అంచనాలు వేశామన్నారు. పశ్చిమ కృష్ణ డెల్టా నుంచి నీరు విడుదలవుతున్నందున జిల్లాలోని తాగునీటి చెరువులన్నీ నింపుతున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో ట్యాంక్ పూర్తిగా నిండుతుందన్నారు. పట్టణ ప్రజలకు రెండు నెలలకు సరిపడా నీరు ఉందని, నీటి సరఫరాకు ఎలాంటి సమస్య లేదన్నారు. తదుపరి జల శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. జల శుద్ధి కేంద్రంలో కలియదిరిగారు. కాపర్ సల్ఫేట్, బ్లీచింగ్ ప్రక్రియ, క్లోరినేషన్ ప్రక్రియ తదుపరి శుద్ధ జలం తయారీ విధానాలు, సరఫరా ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.



శుద్ధ జలం తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకటమురళి అన్నారు. 0.2 పిపిఎం ప్రకారం శుద్ధ జలాలను ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ లీకేజీ నియంత్రిస్తామన్నారు. వర్షాకాలంలో మురుగు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేలా మురికి కాల్వలలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. తదుపరి మూలపాలెం సమీపంలోని 19.50 ఎకరాలలో డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. చెత్త సంపద కేంద్ర వినియోగంలోకి తీసుకురావాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి కేటాయించిన సంబంధిత ఏజెన్సీలు చెత్త సంపద కేంద్ర నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. 35 వేల మెట్రిక్ టన్నుల చెత్త రీసైక్లింగ్ చేయాల్సి ఉందన్నారు. లేకుంటే సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేయాలన్నారు. జిందాల్ పవర్ ప్లాంట్‌కు మరికొంత చెత్త పంపడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన పలు సూచనలు చేశారు. మరుగునీటి కాలువలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పోలీస్ కవాత్ మైదానంలో నిర్వహించేందుకు వీలుగా అక్కడ నీరు నిల్వ లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డిఈ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులకు

3లోపు వేతన బకాయిలు చెల్లించాలి

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి కనకదుర్గాభవాని ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆర్టీసీలో పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఆగష్టు 3వ తేదీలోపు వేతన బకాయిలు చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.కనకదుర్గా భవాని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. ఎపిఎస్ఆర్‌టిసిలో గ్యారేజి, ఎంక్వయిరీలలో పనిచేస్తున్న కార్మికులకు గత సంవత్సర కాలం నుంచి వేతనాలు బకాయిలున్నాయి. వేతన బకాయిల కోసం గతంలో అనేక సార్లు అధికారులను కలసి చర్చించారు. కలెక్టర్, లేబర్ అధికారులు, ఆర్టీసి అధికారులకు అర్జీలు ఇచ్చారు. ఈ క్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ గురువారం తన కార్యాలయంలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. మీటింగ్‌లో ఆర్టీసి మేనేజ్‌మెంట్ తరుపున డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎల్ కోటేశ్వరరావు, కార్మికుల తరుపున సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజనల్ అధ్యక్షులు బివి.రావు పాల్గొన్నారు. సమావేశంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ వచ్చేనెల మూడో తేదీలోపు కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. తొమ్మిది లేబర్ హాలిడేస్ అమలు చేయాలని, ఏటిఎం కార్డులు వారందరికీ అందజేయాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని, ప్రతి ఆరుమాసాలకు డిఎ లెక్కకట్టి వేతనాలు ఇవ్వాలని ఆదేశించారు. ఆమె ఆదేశాలను అమలు చేస్తామని ఆర్టీసి అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమస్యల మీద సమీక్షించేందుకు వచ్చే నెల మూడో తేదీన మరోసారి సమావేశం జరుగుతుందని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు కాంట్రాక్టర్లు చెల్లించకపోతే ఆర్టీసీనే చెల్లించటానికి జోనల్ మేనేజర్ అనుమతి తీసుకుంటామని సమావేశంలో పాల్గొన్న ఆర్టీసి అధికారులు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న కనకదుర్గాభవాని

పోస్టింగ్‌ల కోసం తహశీల్దార్ల ఎదురుచూపు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల సమయంలో స్థానికత ఆధారంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహశీల్దార్లు పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని పలు మండలాల్లో పనిచేస్తున్న తహశీల్దార్లను ఎన్నికల సమయంలో బదిలీ చేశారు. అందులో భాగంగా బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహశీల్దార్లు నెల్లూరు, పల్నాడు, గుంటూరు జిల్లాలకు బదిలీపై వెళ్లారు. జూన్‌లో ఎన్నికల కోడ్ ముగిసింది. అయినప్పటికీ వారు తమ సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లేందుకు మార్గదర్శకాల విషయంలో జాప్యం జరిగింది. తర్జన భర్జనల అనంతరం ఎన్నికల విధులకు ముందు తహశీలార్లుగా పనిచేసిన నియోజకవర్గంలో వారిని మళ్లీ నియమించవద్దని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల సమయంలో వేరే ప్రాంతాలకు వెళ్లిన తహశీల్దార్లు తిరిగి గతంలో పనిచేసిన ప్రాంతాలకు రావడంపై ఈ మేరకు స్పష్టతనిచ్చింది. ఈ మేరకు బాపట్ల జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న తహశీల్దార్లు వారి స్వంత జిల్లాలకు వెళ్లారు. డిప్యూటీ తహశీల్దార్లకు బాధ్యతలు అప్పజెప్పారు. ఇతర జిల్లాల్లో పని చేస్తూ బాపట్ల జిల్లాకు రావలసివారు అక్కడ రిలీవ్ కావడంతో జాప్యం జరుగుతుంది. పల్నాడు జిల్లాకు వెళ్లిన వారు బుధవారం ఆ జిల్లాలో రిలీవ్ కాగా, గుంటూరు జిల్లాలో ఉన్న వారు గురువారం రిలీవ్ అయ్యారు. బాపట్ల జిల్లాలోని మండలాల్లో వివిధ మండలాల్లో తహశీల్దార్లుగా పనిచేస్తున్న గుంటూరు, నెల్లూరు జిల్లాల తహశీల్దార్లు మూడు రోజుల క్రితమే ఇక్కడ నుంచి వారి స్వంత జిల్లాలకు వెళ్లిపోయారు. డిప్యూటీ తహశీల్దార్లకు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. జిల్లాకు వచ్చిన తహశీల్దార్ల నియామక ఉత్తర్వుల అమలులో జరుగుతున్న జాప్యం వల్ల స్వంత జిల్లాలకు వచ్చిన వారు ఎలాంటి పోస్టింగ్‌లు రాకపోవడంతో వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు తహశీల్దార్ల పోస్టింగ్‌ల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులు కూడా ఉంటాయి కనుక వారి నుంచి కూడా ఎవరు.. ఎక్కడ అనే విషయమై స్పష్టత రావాల్సిఉంది. దీంతో మరి కొంత జాప్యం జరిగే పరిస్థితి ఉందని భావిస్తున్నారు. అప్పటివరకు డిప్యూటీ తహశీల్దారు బాధ్యతల్లో ఉంటారని తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం శనివారం నాటికి తహశీల్దారు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ అవుతాయని తెలుస్తోంది.